క్లుప్తంగా

వైఎస్సార్ బీమా అందజేత



బాధిత కుటుంబానికి నగదు అందిస్తున్న దొడ్డి కిరణ్

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు గణపతిన గర్ ప్రాంతంలో నివాసముంటున్న బంక ముత్యాలమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఆమెకు వైఎస్సార్ బీమా ద్వారా మంజూరైంది. అందులో తక్షణ సాయంగా రూ. 10 వేల నగదు ఆ వార్డు అధ్యక్షుడు దొడ్డి కిరణ్ కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో సంతోష్, గణేష్, మోహన్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అభినందన



పబ్లిక్ ప్రాసిక్యూటర్ జగదీశ్వరరావును అభినందిస్తున్న దాడి సత్యనారాయణ

మల్కాపురం: జిల్లా కోర్టు ప్లబిక్ ప్రాసిక్యూటర్ (సెషన్స్ జడ్జి కోర్టు ప్రాసిక్యూటర్)గా ఇటీవల నియమితులైన కాండ్రేగుల జగదీశ్వరరావును వైఎస్సార్‌సీపీ నాయకుడు దాడి సత్యనారాయణ అభినందించారు.జగదీశ్వరరావు ఇంటికి శనివారం వెళ్లిన దాడి ఆయనకు శాలువ కప్పి భవిష్యత్‌లో మరింత ఉన్నత హోదా పొందాలని ఆకాంక్షించారు.

విమాన్‌నగర్‌లో స్వచ్ఛ సర్వేక్షణ్



మాట్లాడుతున్న కార్పొరేటర్ బొమ్మిడి రమణ

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డు విమాన్ నగర్‌లో శనివారం స్వచ్ఛసర్వేక్షణ్ కార్యక్రమం నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ మాట్లాడుతూ 90వ వార్డు స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ముందంజలో ఉండాలని ఆకాంక్షించారు. చెత్త సేకరణతో పాటు నిర్వహణ బాగా జరగాలని కోరారు. వార్డు ప్రజలు తడి, పొడి, ప్రమాదకర చెత్తను ఇంటి వద్దే వేరుచేసి పారిశుధ్య కార్మికులు అందివ్వాలని కోరారు. కార్యక్రంలో ఎస్ఎస్ వెంకటరమణ, పారిశుధ్య సిబ్బంది,సచివాలయ అడ్మిన్లు హరనాథ్, హారిక, స్థానిక నాయకులు నరవ పైడిరాజు, విమాన్‌నగర్ వాసులు పాల్గొన్నారు.

సందడిగా ట్రెడిషన్ డే



కళాశాల ఆవరణలో వేసిన రంగవల్లులు

గోపాలపట్నం: నరవలోని విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఎంబీఏ డిపార్ట్‌మెంట్‌లో ట్రెడిషన్ డేను శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని కళాశాల డైరెక్టర్ బి. భాస్కర్, ప్రిన్సిపాల్ డాక్టర్ వి. శ్రీధర్ పట్నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన సంప్రదాయాలు, సంస్కృతి విద్యార్థులకు తెలియజేసేందుకు ఈ ట్రెడిషన్ డే నిర్వహిస్తున్నామని తెలిపారు. కళాశాల ప్రాంగణంలో విద్యార్థులు వేసిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి ఆడారి తులసీ నాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రూ. 80 లక్షలు మురుగు పాలు!



మిషన్ రన్నింగ్‌లో ఉన్నా లోడు లాగని దృశ్యం



మిషన్ చుట్టూ భారీగా పేరుకుపోయిన వ్యర్థాలు

- నిరుపయోగంగా క్లీనింగ్ మిషన్
- యంత్రం చుట్టూ పేరుకుపోయిన వ్యర్థాలు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు

మల్కాపురం: గెడ్డలో పేరుకుపోతున్న వ్యర్థాలు ఎప్పటికప్పుడు తొలగించేందుకు లక్షల వ్యయంతో యంత్రం పెట్టారు. కానీ ఆ మిషన్ సరిగ్గా పని చేయకపోవడంతో పాటు సమయానికి వ్యర్థాలు తరలించే లారీలు రాకపోవడంతో పూర్వం గెడ్డలో ఎలాంటి పరిస్థితి ఉందో.. నేడు అదే పరిస్థితి ఉంది. మిషన్ ఏర్పాటు చేసిన కొద్ది కాలానికే నిరుపయోగం కావడంతో ప్రజా ధనం ఇలా వృథా అయిందని పలువురు విమర్శిస్తున్నారు.

ఇదీ పరిస్థితి.. జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం మరిడిమాంబ ఆలయం వద్ద గెడ్డ వద్ద ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వ్యర్థాలు భారీగా పేరుకుపోతుండేవి. దీంతో విపరీతమైన దుర్వాసన రావడంతో చుట్టుపక్కల వారితో పాటు ఆ మార్గంలో రాకపోకలు సాగించేవారు ఇబ్బంది పడేవారు. సమస్యను గుర్తించిన రాష్ట్ర ఎడ్యుకేషన్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ మళ్ల విజయప్రసాద్ అప్పటి జీవీఎంసీ కమిషనర్ సృజన దష్టికి సమస్య తీసుకువెళ్లారు. ఆమె స్పందించి సుమారు రూ. 80 లక్షల వ్యయంతో క్లీనింగ్ మిషన్‌ను ఏర్పాటు చేశారు. అయితే ఈ పని చేయాలంటే గెడ్డలో వ్యర్థాలు ఎంత మేర ఉంటే అదే స్థాయిలో వ్యర్థ నీటి శాతం ఉండాలి. అప్పుడే ఈ మిషన్‌కు ఉన్న బెల్ట్ రన్నింగ్ ద్వారా గెడ్డలో వ్యర్థాలు పైకి వచ్చి లారీలో పడుతుంది. అయితే సమయానికి వ్యర్థాలు తరలించే లారీలు రాకపోవడం.. గెడ్డలో వ్యర్థాలు దిగువకు వెళ్లకుండా వేసిన ఇనుప గేటుకు ఉన్న లీకుల కారణంగా గెడ్డలో ఉండాల్సిన నీటి శాతం తగ్గిపోతుంది. దీంతో గెడ్డలో వ్యర్థాలు డ్రైగా మిగిలిపోతున్నాయి. ఈ కారణంగా బెల్ట్ వ్యర్థాలను లాగడం లేదు. అధికారులు దీనిపై స్పందించి వ్యర్థాలను తరలించే లారీలు ఇక్కడ అదనంగా ఉంచాలని కోరుతున్నారు.

ప్రజా ధనం వృథా..



రూ. 80 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన మిషన్ ఏడాది తిరగక ముందే నిరుపయోగంగా మారడం చాలా ఆశ్చర్యకరంగా ఉంది. వ్యర్థాలను తరలించే లారీలు రానప్పుడు ఇక్కడ మిషన్ ఎందుకు పెట్టారో అర్థం కావడం లేదు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

– పంచదార్ల అప్పలరాజుయాదవ్, స్థానికుడు

చాలా ఇబ్బందిగా ఉంది



గెడ్డలో వ్యర్థాలను తొలగించే మిషన్ ఉన్నా నిరుపయోగంగా మారడంతో పూర్వం మాదిరిగానే సమస్య ఉంది. దీంతో ఈ మార్గాన రాకపోకలు సాగించలేక పోతున్నాం. విపరీతమైన దుర్వాసనతో పాటు క్రిములు చేరి ఈ ప్రాంతం అపరిశుభ్రంగా మారుతోంది.

– బాలు, పాదచారి

రైతుబజార్‌లోకి వెళ్లేదెలా..?



కంచరపాలెం రైతుబజార్ ప్రధాన గేటుకు అడ్డంగా నిర్వహిస్తున్న తోపుడు బండ్ల వ్యాపారాలు

కంచరపాలెం: కంచరపాలెం రైతుబజార్ ప్రధాన గేటుకు ఇరువైపులా నిర్వహిస్తున్న చిరు వ్యాపారాలతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. గేటు వద్ద దుకాణాలు, తోపుడు బండ్లను అడ్డంగా పెట్టడంతో బజారు లోకి వెళ్లేందుకు దారి లేకుండా పోతోందని వాపోతున్నారు. రైతుబజార్ లోపల పార్కింగ్ అస్తవ్యస్తంగా మారింది. దీంతో బజారు బయటే కొందరు ద్విచక్ర వాహనాలను ఇష్టానుషారంగా పార్క్‌చేసి వెళ్లి పోతున్నారు. రైతు బజార్ ఈవో పట్టించుకోకపోవడంతో ప్రధాన గేటు వద్ద రోజురోజుకూ పుట్టగొడుగుల్లా చిరు వ్యాపారాలు వెలుస్తున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రధాన రహదారిలో తోపుడు బళ్లు అడ్డంగా పెట్టి వ్యాపారాలు చేస్తున్నా.. ట్రాఫిక్ పోలీసుల చర్యలు కనిపించడం లేదని పలువురు చెబుతున్నారు. సంబంధిత పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న రామ్మోహనరెడ్డి

సింథియా: జీవీఎంసీ 63వ వార్డు పరిధిలోని వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను శనివారం వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి సందర్శించారు. ముందుగా వైద్య సిబ్బందితో ఆస్పత్రిలో సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా రామ్మోహనరెడ్డి మాట్లాడుతూ వార్డులో అధిక శాతం పేద, మధ్య తరగతి ప్రజలే ఉన్నారన్నారు. దాన్ని దృష్టిలో పెట్టుకుని వైద్య సేవలు అందించాలని కోరారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా చర్యలు చేపడతానన్నారు.

స్టీల్‌ప్లాంట్ భూములు ఆక్రమిస్తే చర్యలు

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవని స్టీల్‌ప్లాంట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జేవీవీఎస్ రామమోహన్‌రావు హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ ఎస్‌డీసీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయన శనివారం ఉదయం పెదగంట్యాడ మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. భూ ఆక్రమణలకు సంబంధించిన ఫిర్యాదులు వెల్లువెత్తడంతో స్పందించిన ఆయన, ఆయా భూములను పరిశీలించారు. నడుపూరులోని శీరవానిపాలెం, నెల్లిముక్కు పెంటమాంబ ఆలయం వద్ద, శీకువానిపాలెం తదితర ప్రాంతాల్లోని స్టీల్‌ప్లాంట్ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెదగంట్యాడ మండలంలో ఉక్కు నిర్వాసితులకు కేటాయించిన భూములు ఎక్కువగా ఆక్రమణలకు గురవుతున్నాయని, వాటికి సంబంధించి ఆయా రికార్డులను పరిశీలిస్తున్నామని చెప్పారు. రికార్డులు సక్రమంగా ఉంటే ఫర్వాలేదని, లేని పక్షంలో ఆయా అక్రమ నిర్మాణాలను తొలగించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత తహసీల్దార్లకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. ఆయన వెంట ఆర్ఐ రవికుమార్, సర్వేయర్ వరిబంధు, వీఆర్వోలు శివశంకర్, అనూష, కావ్య ఉన్నారు.

ప్రజా ఉద్యమాలకు తలవంచక తప్పదు

- స్టీల్‌ప్లాంట్ జోలికి వస్తే కేంద్రానికి గుణపాఠం
- స్పష్టం చేసిన ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు
- దీక్షలకు మాతృశ్రీనగర్ మహిళల సంఘీభావం



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న ఆదినారాయణ

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం ఎన్ని ఎత్తుగడలు వేసిన ప్రజా ఉద్యమాల ముందు తలవంచక తప్పదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. మహనీయుల త్యాగాలతో ఏర్పడిన స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటామని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలో 695వ రోజు శనివారం సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులతో పాటు కూర్మన్నపాలెం ప్రాంతానికి చెందిన మాతృశ్రీనగర్ ఫేజ్–2,5,7 నుంచి మహిళామణులు పాల్గొని, సంఘీభావం తెలిపారు. శిబిరంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, ఎస్.రామచంద్రరావు, కేఎస్ఎన్ రావు, వై.టి. దాస్, జె.రామకృష్ణ, కారు రమణ, గుమ్మడి నరేంద్ర, ఐద్వా ప్రతినిధులు ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వ విధ్వంసకర ప్రయత్నాలకు అండగా ఉంటూ, వాటిని అమలు చేసే అధికారులకు తగిన గుణపాఠం నేర్పుతామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు తహతహలాడుతోందని, విశాఖ ఉక్కు జోలికి వస్తే కాంట్రాక్ట్ కార్మికులు, నిర్వాసితులు, ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కొనడానికి ఎవరు ముందుకు వచ్చిన అడ్డుకుంటామన్నారు. ఈ నెల 30న జరప తలపెట్టిన ఉక్కు ప్రజాగర్జనలో ఉక్కు ఉద్యోగులు, కార్మికులు, స్థానిక ప్రజలు కుటుంబసభ్యులతో కలిసి పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో నాయకులు టి.ఎస్.ఎన్, బి.ఎం.ఎల్.నాయుడు, విశ్వేశ్వరరావు, ఇతర కార్మికులు, మహిళలు పాల్గొన్నారు.

యువత ఉపాధి కోసం పోరాడాలి



విజేతలకు బహుమతులు అందిస్తున్న మల్కాపురం సీఐ లూథర్‌బాబు

సింథియా : యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా ఉపాధి కోసం పోరాడుతూ కుటుంబాలకు అండగా ఉండాలని మల్కాపురం సీఐ లూథర్‌బాబు అన్నారు. ఈ మేరకు జీవీఎంసీ 63వ వార్డు పరిధి క్రాంతినగర్‌లో డివైఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ యర్నాగుల రామారావు అస్లాం 15వ వర్ధంతి నిర్వహించారు. డివైఎఫ్ఐ నాయకుడు రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సీఐ లూథర్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. యువత చెడు మార్గాల్లో వెళ్లకుండా మంచి మార్గంలో నడిచేందుకు కృషి చేస్తున్న డివైఎఫ్ఐ కమిటీని అభినందించారు. అనంతరం ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పలువురు డివైఎఫ్ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇతని ఆచూకీ తెలపండి



మనోజ్‌కుమార్

గోపాలపట్నం: ఫ్లాట్ల అమ్మకాల్లో మోసానికి పాల్పడిన కేసులో ముద్దాయి అయిన గంటో మనోజ్‌కుమార్ ఆచూ కీ తెలపాలని గోపాలపట్నం పోలీసులు ఒక ప్రకటనలో కోరారు. ఇతను పలు కేసుల్లో ముద్దాయి అని పోలీసులు తెలిపారు. విశాఖపట్నం రెండో అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టుకు హాజరు కానందున ఇతన్ని ముద్దాయిగా ప్రకటించారు. గతంలో ఇతను సంజీవయ్యనగర్‌లో నివసముండే వాడు. ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. ఈ వ్యక్తి ఆచూకీ తెలయపరచాలని ఈ సందర్భంగా గోపాలపట్నం పోలీసులు కోరారు.

ఏయూ వీసీతో కేఎస్‌బీ కార్యదర్శి భేటీ

- రక్షణ రంగ ఉద్యోగులకు వర్సిటీ సహకారంపై చర్చ



వీసీతో సమావేశమైన హెచ్.పి. సింగ్

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని కేంద్రీయ సైనిక్ బోర్డ్ (కేఎస్‌బీ) కార్యదర్శి కమోడోర్ హెచ్.పి. సింగ్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి, వివిధ అంశాలపై చర్చించారు. క్రెడిట్ టాన్స్‌ఫర్ విధానంలో రక్షణ రంగాలలో వైద్యవిభాగంలో పనిచేసి పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు డిప్లమా ఇన్ ఫార్మసీ అందించాలని ప్రతిపాదన చేశారు. ఈ దిశగా ఏయూతో ఎంవోయూ చేసుకోవాలని భావిస్తున్నట్లు తెలిపారు. రక్షణ రంగాల ఉద్యోగుల సతీమణులకు బీఏ ఫైన్‌ఆర్ట్స్ కోర్సును ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే అంశంపై చర్చించారు. రక్షణ రంగాల ఉద్యోగులకు ఏయూ పరంగా అవసరమైన సహకారాన్ని పూర్తిస్థాయిలో అందిస్తామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, డాక్టర్ ఉజ్వల్ కుమార్ ఘటక్, ఆర్ఎస్‌బీ డైరెక్టర్ బ్రిగేడియర్ వి.వి రెడ్డి, విశాఖ, తూర్పుగోదావరి జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు సొసైటీ మహా జనసభ

సింహాచలం: అడవివరం కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ మహాజనసభ ఆదివారం నిర్వహిస్తున్నట్టు సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి తెలిపారు. ప్రియాగార్డెన్స్‌లోని స్వామి బృందావనంలో ఉదయం 10 గంటలకు సభ ప్రారంభమవుతుందని, సంఘ సభ్యులంతా పాల్గొనాలని కోరారు.

వీఎఫ్ఎస్ అధ్యక్షుడిగా కృష్ణ



ఆచార్య టి.వి. కృష్ణకు నియామక పత్రం అందిస్తున్న సొసైటీ సభ్యులు

ఏయూక్యాంపస్: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ అధ్యక్షుడిగా ఏయూ మానవ వనరుల అభివృద్ధి కేంద్రం సంచాలకుడు ఆచార్య టి.వి.కృష్ణ బాధ్యతలు చేపట్టారు. ఫిల్మ్ సొసైటీ సభ్యులు ఆచార్య టి.వి కృష్ణను కార్యాలయంలో కలసి, శనివారం నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ఫిల్మ్ సొసైటీ నిర్వహించే కార్యక్రమాలకు తన సంపూర్ణ సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో ఆచార్య ఎన్.ఏ.డి. పాల్, వీఎఫ్ఎస్ కార్యదర్శి ఎన్.ప్రకాశరావు, సహాయ కార్యదర్శి బి.చిన్నారావు, కార్యవర్గ సభ్యులు గాయత్రి, సంతోష్ కుమార్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధనుర్మాస పూజలు



సింహాచలం వెంకన్న ఆలయంలో విశేష అలంకరణలో గోదాదేవి



పెందుర్తి వెంకటాద్రిపై వెంకన్నకు పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు రామానుజమ్

సింహాచలం: ధనుర్మాస పూజలను పలు ఆలయాల్లో శనివారం విశేషంగా నిర్వహించారు. సింహగిరిపై తెల్లవారుజామున 3 గంటలకు స్వామికి సుప్రభాత సేవ నిర్వహించారు. విశేష ఆరాధన, చతుర్వేద పారాయణం, ఉపనిషత్తు పారాయణం, తిరుప్పావై సేవాకాలం అనంతరం గోదాదేవికి బేడామండపంలో తిరువీధి జరిపారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, వేద పండితులు, అధ్యాపకులు పూజలు నిర్వహించారు.

వెంకన్న ఆలయంలో....

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ధనుర్మాస పూజలు వైభవంగా నిర్వహించారు. గోదాదేవి అమ్మవారికి విశేష అలంకరణ చేసి వేదికపై అధిష్టంప జేశారు. తిరుప్పావై సేవాకాలం, పాశుర విన్నప పారాయణ నిర్వహించారు. ఆలయ అర్చకులు భార్గవ్ తదితరులు పూజలు చేశారు.

వెంకటాద్రిపై..

పెందుర్తి వెంకటాద్రిపై ఉదయం తిరుప్పావై సేవాకాలం .. గోదాదేవికి వైభవంగా పూజలు నిర్వహించారు. వెంకన్నకు విశేషంగా అభిషేకాలు, పూజలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకులు రామానుజమ్ పూజలు నిర్వహించారు.

కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలని యాత్ర



సంఘీభావం తెలుపుతున్న జెర్రిపోతుల పరశురామ్, సాధన సమితి సభ్యులు

సీతంపేట: కరెన్సీ నోట్లపై డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఫొటో ముద్రించాలని పల్లె నుంచి ఢిల్లీ వరకు ప్రజా పోరు రథయాత్ర నిర్వహించనున్నట్టు కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జెర్రిపోతుల పరశురామ్ తెలిపారు. రామా టాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్‌బీఐ స్ఫూర్తి ప్రదాత అంబేడ్కర్ ఫొటోను కరెన్సీ నోట్లపై ముద్రించడంతోపాటు నూతన పార్లమెంట్‌కు ఆయన పేరు పెట్టాలని, గణతంత్ర దినోత్సవంలో ఆయన చిత్రపటం పెట్టాలని డిమాండ్ చేశారు. వీటి సాధన కోసం భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన జనవరి 26న విశాఖపట్నం అంబేడ్కర్ భవన్ నుంచి ఢిల్లీ వరకు ప్రజా పోరు రథయాత్ర చేస్తామని చెప్పారు. పరశురామ్‌తో కలిసి సమితి జాతీయ సలహాదారు ఆళ్ల రామకృష్ణ, ఏఎంఎస్ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు, బహుజన కళా మండలి కార్యదర్శి ఉదయ భాస్కర్, బి.దీపక్ సంఘీభావం తెలిపారు.

త్రివిక్రముడిగా అప్పన్న



త్రివిక్రముడి అలంకరణలో అప్పన్న

సింహాచలం: సింహగిరిపై నిర్వహిస్తున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి శనివారం త్రివిక్రముడి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చాడు. స్వామి వారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అలంకరించి శ్రీదేవి,భూదేవి సమేతంగా పల్లకిలో అధిష్టంప జేశారు. ఆళ్వారులను మరో పల్లకిలో వేంచేయజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో ఘనంగా తిరువీధి నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

అప్పన్నను దర్శించుకున్న రామానుజ జీయర్



అప్పన్న ఆలయంలో అహోబిల రామానుజ జీయర్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం అహోబిల రామానుజ జీయర్‌స్వామి దర్శించుకున్నారు. ఆలయ బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. స్వామికి పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ ఏఈవో నరసింహరాజు స్వామీజీకి ప్రసాదం అందజేశారు.

వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధి గొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం అభిషేకాలు చేశారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా గోదాదేవి తరపున శ్రీరంగనాథుడికి పాశుర విన్నపం సమర్పించారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన చేశారు. మధ్యాహ్నం 200 మంది భక్తులకు అన్నసమారాధన జరిపారు. సాయంత్రం 5.30 గంటలకు ఆకాశ దీపారాధన, 7 గంటలకు స్వామికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు.

శారీరక దారుఢ్య పరీక్షలపై ప్రత్యేక శ్రద్ధ

ఏయూక్యాంపస్: పోలీసు ఉద్యోగాల నియామక ప్రక్రియలో శారీరక దారుఢ్య పరీక్షలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మహారాణిపేట సీఐ సోమశేఖర్ సూచించారు. అల్లూరి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీసు ఉద్యోగార్థుల శిక్షణ తరగతుల శిబిరానికి శనివారం ఆయన హాజరై అభ్యర్థులకు పలు సూచనలిచ్చారు. ఉద్యోగం సాధించడంలో శారీరక దారుఢ్య పరీక్ష తొలి మెట్టుగా నిలుస్తుందన్నారు. సరైన శిక్షకుల పర్యవేక్షణలో మెళకువలు నేర్చుకోవాలని, దీని వల్ల సులభంగా పరీక్షలో ఉత్తీర్ణత సాధించడం వీలవుతుందని చెప్పారు. మంచి ఆహారపు అలవాట్లు కలిగి ఉండటం, నిత్యం వ్యాయామం చేయడం ఎంతో అవసరమన్నారు. మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ తమ ఆరోగ్యాన్ని యువత పరిరక్షించుకోవాలని సీఐ సోమశేఖర్ ఆకాంక్షించారు.